క్లుప్తంగా

భూమిపూజ

మదనాపురం: మండలంలోని అజ్జకొల్లులో ఐకేపీ వడ్ల కొనుగోలు కేంద్రం వద్ద ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సహకారంతో జెడ్పీటీసీ నిధుల నుంచి రూ.2 లక్షలతో శనివారం మినీ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి జెడ్పీటీసీ కృష్ణయ్యయాదవ్ భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాములు, నాయకులు కరుణాకర్‌రెడ్డి, శాంత మూర్తి, బ్రహ్మయ్య చారి, ఎద్దుల లక్ష్మన్న, కరగట్ల మల్లేష్, శ్రీనివాసులు, బోయిని శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రేపు పాదయాత్ర

పాన్‌గల్: అక్టోబర్ 2వ తేదీ నుంచి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సత్యమేవ జయతే పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాదయాత్ర మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి ప్రారంభించి గాంధీ విగ్రహం ఎదుట ప్రతిజ్ఞ చేసిన అనంతరం పాదయాత్ర మొదలవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ అమలు చేసే సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేస్తామని పేర్కొన్నారు. పాదయాత్రకు ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రూ.1.25 లక్షల ఎల్‌ఓసీ అందజేత

పాన్‌గల్: మండలంలోని శాగాపూర్‌కు చెందిన కానమోని రామకృష్ణ అనారోగ్యంతో బాధపడుతుండడంతో మెరుగైన వైద్యం కోసం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరయిన రూ.1.25 లక్షల ఎల్‌ఓసీని శనివారం కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అందజేశారు. రామకృష్ణ బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయాన్ని ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు సుబ్బయ్యయాదవ్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడంతో ఎల్‌ఓసీని మంజూరు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సుబ్బయ్యయాదవ్, హలీంపాష, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామసభ నిర్వహణ

పాన్‌గల్: మండలంలోని కొత్తపేటలో నిర్వహించిన ఉపాధి పనులపై శనివారం సామాజిక తనిఖీ సిబ్బంది ఆధ్వర్యంలో గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ 13వ విడత సామాజిక తనిఖీలో భాగంగా 2022 జనవరి నుంచి 2023 మార్చి వరకు గ్రామంలో చేపట్టిన ఉపాధి పనులపై ఖర్చు నిధులపై ఆడిట్ నిర్వహించి దానికి అనుగుణంగా గ్రామసభ నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామాల్లో ఆడిట్, గ్రామ సభలు అనంతరం మండల స్థాయిలో ప్రజావేదిక నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేష్, ఆడిట్, ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

ర్యాక్, పుస్తకాల వితరణ



మదనాపురం: మండల కేంద్రంలోని గ్రంథాలయానికి శనివారం 1982–83 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు ర్యాక్, పుస్తకాలను తహసీల్దార్ అబ్రహంకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రామనారాయణ, పాఠశాల హెచ్‌ఎం వెంకటేష్, మహేందర్ గౌడ్, సుదర్శన్‌రావు, పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కొత్తకోట రూరల్: దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా మండలంలోని నాటవెల్లిలో మాజీ సర్పంచ్ ఎద్దుల నాగేష్ సొంత ఖర్చులతో గ్రామస్తులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా గ్రామంలో దీర్ఘకాలిక వ్యాధులు, కీళ్ల నొప్పులు, ఎముకల సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి కావాల్సిన మందులను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, సర్పంచ్ ఎద్దుల లావణ్య, జగన్‌మోహన్‌రెడ్డి, సాక బాలనారాయణ, మాధవరెడ్డి, లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

ఖిల్లాఘనపురం: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం వినాయకుడి నిమజ్జన కార్యక్రమాలను భక్తులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ముదిరాజ్ సంఘం భవనంలో, కమాలోద్దీన్‌పూర్, మలిక్మియాన్‌పల్లి తదితర గ్రామాల్లో ప్రతిష్ఠించిన వినాయకుడి నిమజ్జనం కార్యక్రమాలను కనుల పండువగా చేశారు. ఖిల్లాఘనపురం వినాయకుడి లడ్డును గ్రామానికి చెందిన తిమ్మాపురం పెద్ద కుర్మయ్య రూ.55 వేలకు, కమాలోద్దీన్‌పూర్‌లో రూ.25,016 కు గ్రామానికి చెందిన మునయ్య వేలంలో దక్కించుకున్నారు



‘పర్యావరణ పరిరక్షణ’ బాధ్యత



ఆత్మకూర్‌లో ముగ్గుల పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ఆత్మకూర్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, వ్యర్థాలను ఎక్కడబడితే అక్కడ పారబోయకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పుర చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని అక్షర హైస్కూల్‌లో ఇండియన్ స్వచ్ఛత లీగ్ 2.0 కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత హై సేవా, వేస్ట్ టూ వండర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులచే మార్కెట్‌యార్డులో నిర్వహించిన ముగ్గుల పోటీలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అత్యంత ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్, పాఠశాల డైరెక్టర్ దామోదర్, ప్రిన్సిపాల్ మహేష్ తదితరులు ఉన్నారు.

అమరచింత: వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటిస్తేనే అందరం ఆరోగ్యంగా ఉంటామని మున్సిపల్ చైర్ పర్సన్ మంగమ్మ, కమిషనర్ మహమ్మద్‌ఖాజా అన్నారు. స్వచ్ఛత హై సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని డీఎంఆర్‌ఎం, బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులతో పాటు పట్టణ సమాఖ్య సభ్యులతో కలిసి రంగోళి కార్యక్రమం నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత గురించి విద్యార్థినులకు, మహిళలకు అవగాహన కల్పించి స్వచ్ఛత పాటిస్తామంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈమేరకు వారు మాట్లాడుతూ తడి, పొడి చెత్తలను వేర్వేరుగా చేసి చేత్త సేకరణ వాహనంలో వేయాలని సూచించారు. ఈవిషయాన్ని ప్రతి ఒక్కరికీ వివరించాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో మురుగు ఉంటే ఈగలు, దోమల వ్యాప్తి చెంది డెంగ్యూ, మలేరియా వంటి ప్రమాదకర వ్యాధులు విస్తరించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల జీహెచ్‌ఎం కరుణాకర్, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ నాగభూషణంగౌడ్, ఆర్పీ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో శ్రమదానం

పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవరణలో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు తొలగించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాశంశెట్టి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలకు దూరంగా ఉంటారని పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవాపై గ్రామాల్లో విద్యార్థులు అవగాహన కల్పించాలన్నారు. గాంధీ జయంతి రోజు ప్రతి ఒక్కరూ గంట పాటు శ్రమదానం నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి, అధ్యాపక బృందం, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: స్వచ్ఛత హై సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించాలని ఎంపీడీఓ విజయ్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని గ్రామాల్లో అక్టోబర్ 1న ఉదయం 10 గంటలకు నిర్వహించే శ్రమదానం కార్యక్రమంలో యువకులు, పెద్దలు, ప్రజాప్రతినిధులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాలు పంచుకోవాలని కోరారు. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించడం వలన గ్రామాలు శుభ్రంగా ఉండటంతో పాటుగా, ప్రజలు కూడా ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు.



అమరచింతలో..



పాన్‌గల్‌లో శ్రమదానం చేస్తున్న విద్యార్థులు

అవినీతి పాలనకు ఓటుతో గుణపాఠం



ప్రచారంలో ధర్మ సమాజ్ పార్టీ నాయకులు

పాన్‌గల్: రాజ్యాంగం కల్పించిన ఓటును అమ్ముకోకుండా ఆలోచించి వేయాలని, మన ఓటు మనకే వేసుకుందామని ధర్మసమాజ్ పార్టీ కొల్లాపూర్ నియోజకవర్గ అభ్యర్థి ఆది సంధ్యారాణి అన్నారు. శనివారం మండలంలోని రాయినిపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధర్మసమాజ్ పార్టీ (డీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షులు డా.విశారధన్ మహరాజ్ ఆదేశాల మేరకు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమం కోసం ధర్మ సమాజ్ పార్టీ వచ్చిందని, జనాభాలో అధిక శాతం ఉన్న బడుగులం ఐకమత్యంతో మన ఓట్లను ఇతర వర్గాలకు వేయవద్దన్నారు. బహుజన తెలంగాణ, సామాజిక న్యాయం జరగాలంటే ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థికి మద్దతు ప్రకటించాలని కోరారు. ఓటు ద్వారానే రాజ్యాధికారం సాధ్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ నాయకులు బలరాం, శివ, అరుణ్, అరుణ, విజయ్, ఆంజనేయులు, మహేష్, రామకృష్ణ, ఆశోక్, శివ పాల్గొన్నారు.

రైతులకు రుణాలు అందజేయడంలో జాప్యం



నివేదిక చదువుతున్న వైద్యాధికారి వంశీకృష్ణ

వీపనగండ్ల: మండలంలోని ప్రజా సమస్యలపై పూర్తిగా చర్చించి నిర్ణయాలు తీసుకోవాల్సిన మండల సర్వసభ్య సమావేశం శనివారం మొక్కుబడిగా సాగింది. ఎంపీపీ కమలేశ్వర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రైతులకు కొత్త రుణాలు ఇవ్వడం లేదని, పలువురి రైతుల ఖాతాలో రుణమాఫీ డబ్బులు జమ కాలేదని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సభ దృష్టికి తెచ్చారు. గ్రామాల్లో మొక్కల పెంపకం కోసం వాచర్ల ద్వారా నీళ్లు పోయించేందుకు వారి 100 రోజుల పనిదినాలు ముగియడంతో మొక్కలకు నీరు పట్టడం ఇబ్బందవుతుందని వల్లభాపురం సర్పంచ్ రవీందర్‌రెడ్డి సభలో ప్రస్తావించారు. ఆశా వర్కర్లు సమ్మె చేస్తుండడంతో గ్రామంలోని దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు మాత్రలు అందడం లేదని కల్వరాల సర్పంచ్ రఘునాథ్‌రెడ్డి వివరించారు. ‘కంటివెలుగు’ లో సర్పంచ్‌ల ద్వారా ఖర్చు చేయించిన డబ్బులు నేటికీ ఇవ్వలేదని సంగినేనిపల్లి సర్పంచ్ మౌలాలి వాపోయారు.

తాగునీటి సరఫరాలో ఇబ్బందులు

సంపత్‌రావుపల్లిలో మిషన్ భగీరథ ద్వార 400 మీటర్ల పైపులైన్ వేయకపోవడంతో తాగునీటికి ఇబ్బందవుతుందని సర్పంచ్ రామేశ్వరావు అన్నారు. కొత్త రేషన్‌కార్డులు ఇవ్వకపోవడంతో పలు గ్రామాల్లో పేదలకు రేషన్ అందట్లేదన్నారు. సర్వసభ్య సమావేశంలో తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీఓ కతలప్ప, మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు ముంత మల్లయ్యయాదవ్, సింగిల్‌విండో చైర్మన్ రామన్‌గౌడ్, ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మమ్మ, వైద్యాధికారి వంశీకృష్ణ, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, వ్యవసాయ అధికారి డాకేశ్వర్‌గౌడ్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పంట రుణాలు రెన్యూవల్ చేసుకోవాలి



రుణం మంజూరు పత్రం అందిస్తున్న మురళీధర్‌రెడ్డి

ఖిల్లాఘనపురం: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో పంట రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో రెన్యూవల్ చేసుకోవడం వలన వడ్డీ తక్కువగా పడుతుందని సహకార సంఘం అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడి ఆధ్వర్యంలో అర్ధ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అభ్యున్నతి కోసం సంఘం ద్వారా ప్రతి ఏటా కొత్తగా వ్యవసాయ రుణాలతో పాటుగా అవసరమైన వారికి వ్యవసాయ ఆధారిత పరిశ్రమల కోసం రుణాలు ఇస్తామని తెలిపారు. 18 మంది రైతులకు రూ.5 58 లక్షల పంటరుణాలు, రుణమాఫీ అయిన 38 మంది రైతులకు రూ.33.47 లక్షల రుణాలను అందించామని పేర్కొన్నారు. సంఘం నుంచి మొత్తం 786 మంది రైతులకు రూ.3.72కోట్ల పంట రుణాలు ఇవ్వగా ఇప్పటి వరకు 594 మంది రైతులకు రూ.2.69 కోట్ల రుణమాఫీ అయ్యిందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య, సంఘం ఉపాధ్యక్షుడు క్యామ రాజు, డైరెక్టర్లు కృష్ణయ్యగౌడ్, భాస్కర్‌రెడ్డి, వాల్యానాయక్, ఎదిరె నారాయణ, సీఈఓ ప్రకాష్, కార్యాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టుమిషన్ శిక్షణ

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని స్వామి రామానంద తీర్థ శిక్షణ కేంద్రంలో ఉచిత కుట్టుమిషన్, ఎంబ్రాయిడరీ శిక్షణ ఇస్తున్నామని, అక్టోబర్ 1 నుంచి 49వ బ్యాచ్ ప్రారంభిస్తున్నట్లు ట్రెయినర్ రామేశ్వరమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారికి మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. సర్టిఫికెట్‌తో స్వయం ఉపాధి పొందడంతో పాటు ప్రైవేట్‌లో ఉద్యోగం చేసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ఉమ్మడి గోపాల్‌పేట మండలంలోని మహిళలు, యువతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పాన్‌గల్: మండలానికి చెందిన ఓ దినపత్రిక విలేకరి ముళ్లపాటి కాశీనాథ్ తండ్రి బుచ్చన్న అనారోగ్యంతో మృతి చెందడంతో శనివారం ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

మండల ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో..

అనారోగ్యంతో మృతిచెందిన బుచ్చన్న కుటుంబాన్ని మండల ప్రెస్‌క్లబ్ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రెస్‌క్లబ్ సభ్యులు నయ్యూమ్‌ఖాన్, రాములు, రాఘవేందర్‌గౌడ్, రమేష్‌రావు, రాములుయాదవ్ పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

మోదీ బహిరంగసభను జయప్రదం చేద్దాం

ఆత్మకూర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలమూరు బహిరంగ సభను జయప్రదం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో అమరచింత, ఆత్మకూర్ మండలాల బీజేపీ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. నరేంద్రమోదీ ఆధ్వర్యంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని, మరోసారి అధికారం కట్టబెట్టాలని విజ్ఞప్తిం చేశారు. సమావేశంలో మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అశ్విన్‌కుమార్, నియోజకవర్గ కన్వీనర్ రేచింతల శ్రీను, జిల్లాకార్యదర్శి అశోక్ కుమార్‌జీ, జిల్లా ఉపాధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, నాయకులు గంగాధర్‌గౌడ్, శశిధర్‌రెడ్డి, భీంరెడ్డి, తమ్మలి వెంకటేష్, రాజు, ఎల్లన్న, గాడిశేషు, రఘుయాదవ్, బాలకృష్ణ, వెంకట్రాములు, రాము తదితరులు ఉన్నారు.

పదోన్నతులు కల్పించాలి



వనపర్తి టౌన్: కోర్టు తీర్పు ప్రకారం టెట్–2లో క్వాలిఫై అయిన ఎస్‌జీటీలకు పదోన్నతులు కల్పించాలని టెట్–2 అర్హత సాధించిన ఎస్‌జీటీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయంలో డీఈఓ నరహరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హుస్సేన్, చంద్రశేఖర్ మాట్లాడుతూ... జిల్లాలో టెట్–2 క్వాలిఫై అయిన ఎస్‌జీటీలు 150 నుంచి 250 మంది వరకు ఉన్నామని, పదోన్నతులకు టెట్–2 క్వాలిఫై అయిన ఎస్‌జీటీలు లేరని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎస్‌జీటీలు దుర్గాప్రసాద్, రవికుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి

పెబ్బేరు రూరల్: గ్రామ పంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని పంచాయతీ కార్మికుల జేఏసీ నాయకులు హనుమంతునాయక్ డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలోని మర్రికుంట ధర్నా చౌక్‌లో నిర్వహిస్తున్న సమ్మె గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. గతంలో సమస్యలు పరిష్కరిస్తామని ప్రభుత్వం చెప్పి మాట తప్పిందని ఆరోపించారు. వేతనాలు పెంచే వరకు సమ్మెను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు రాములు, సుబ్బయ్య, పుష్ప, సుగ్రీవుడు, దాస్, హనీఫ్, చంద్రశేఖర్, శ్రీను, శివకుమార్, రాజ్‌కుమార్, నరేష్, తిరుపతయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హంతకులను కఠినంగా శిక్షించాలి

పెబ్బేరు రూరల్: గణపురం తేజస్విని చంపిన దుండగుడిని కఠినంగా శిక్షించాలని భారత జాతీయ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కళావతమ్మ డిమాండ్ చేశారు. శనివారం ఆమె వనపర్తి జిల్లా సీపీఐ కార్యాలయంలో మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లాలోని జక్రాన్‌పల్లి చెందిన దళిత యువతి తేజస్విపై సెప్టెంబర్ 24న ప్రేమోన్మాది ఇమ్రాన్ విచక్షణా రహితంగా దాడి చేశాడు. గాయపడిన బాధితురాలు జిల్లా ఆస్పత్రిలో వైద్యం పొందుతూ 29న మరణించిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు, బాలికలకు రాష్ట్రంలో రక్షణ కరవైందన్నారు.

మేరా దేశ్.. మేరీ మట్టి

కొత్తకోట: భారత ప్రభుత్వం తపాలా శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ‘మేరా దేశ్–మేరీ మట్టి’ కార్యక్రమంలో భాగంగా అమరవీరుల త్యాగాలను గుర్తుచేసుకున్నారు. శనివారం కొత్తకోటలో తపాల శాఖ పర్యవేక్షకులు వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఐపీఓ చౌహాన్, సబ్ పోస్ట్ మాస్టర్ యుగంధర్, మల్లేష్, రామిరెడ్డి, తపాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



కానాయపల్లిలో చిన్నారికి ఆర్థికసాయం అందజేస్తున్న వైస్ ఎంపీపీ వడ్డె శ్రీనివాసులు

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లికి చెందిన శ్యామల, దస్తగిరి దంపతులల కుమార్తె గాయత్రి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. శనివారం దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా కానాయపల్లిలో గల టీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో వైస్‌ఎంపీపీ వడ్డె శ్రీనివాసులు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆదేశానుసారం గాయత్రికి రూ.10వేల ఆర్థికసాయాన్ని ఎంపీపీ వడ్డె శ్రీనివాసులు అందజేశారు. కార్యక్రమంలో రావుల మురళీధర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, వడ్ల భాస్కర్, వెంకటేష్‌సాగర్, ఉప సర్పంచ్ వడ్డె రాములు, రవీందర్‌గౌడ్, హోటల్ రాజునాయుడు, గోవర్ధన్‌నాయుడు, వడ్డె నాగరాజు, దారమోని నాగరాజు, నక్కల చిన్న నర్సింహ, మొగులయ్య, మురళి, తోకలి భీమన్న పాల్గొన్నారు.

వనపర్తి టౌన్: దివంగత తెలంగాణ విద్యార్థి ఉద్యమ నాయకుడు దాసరాజు మహేష్ మాత్యమూర్తి మరణించడంతో శనివారం అంత్యక్రియలకు మంత్రి నిరంజన్‌రెడ్డి అందించిన రూ. 5వేలను మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ బాధిత కుటుంబానికి అందించారు. అనంతరం మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట రమేష్, నాగరాజు, రవి పాల్గొన్నారు.

ఆర్థికంగా రాణించాలి



అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారులు

ఆత్మకూర్: బ్యాంకుల ద్వారా రుణాలు పొంది మహిళలు, రైతులు, నిరుద్యోగులు ఆర్థికంగా రాణించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంక్ మేనేజర్ నవీన్‌కుమార్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, సర్పంచ్ విజయలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని పిన్నంచర్లలో ఏపీజీవీబీ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా రైతు, మహిళా సంఘాల రుణాలు, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమాయోజన, పీఎం సురక్ష బీమా, అటల్ పెన్షన్‌యోజన, సైబర్ మోసాలు, డిజిటల్ లావాదేవీలు తదితర విషయాలపై కళాజాతా బృందంచే అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్లు హుస్సేన్, ఇంద్రాణి, పంచాయతీ కార్యదర్శి మురళి, మెజీషియన్ రాఘవేంద్ర, డప్పు రాజేష్, ఉప సర్పంచ్ మాసన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

పది గంటలు కూడా కరెంటు ఉండటం లేదు



నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గోపాల్‌పేట: బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్రంలో 24 గంటల కరెంటు ఇస్తున్నామని గొప్పలు చెబుతున్నా.. క్షేత్ర స్థాయిలో పది గంటలకు మించి రైతులకు కరెంటు రావడం లేదని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించారు. శనివారం మండలంలోని తిర్మలాపూర్ సబ్ స్టేషన్ వద్ద కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గణేష్‌గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు నిరసన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శుక్రవారం వనపర్తి సభలో మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ రైతులకు 24 గంటల కరెంటు ఇస్తున్నామని చెప్పడం హాస్యాస్పదం అని ఎద్దేవా చేశారు అన్నారు. లోవోల్టేజీ సమస్యను తీర్చాలని ఏఈ హర్షవర్ధన్ కోరగా.. వీలైనంత తొందరగా సమస్యను పరిష్కస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో వెంకటయ్య, బొజ్జన్న యాదవ్, బాలపీరు, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.18వేల వేతనం ఇవ్వాలి

సాక్షి, నెట్‌వర్క్: ఆశా కార్యకర్తలకు పనిభారం పెరిగినందున, పనికి తగ్గ వేతనం రూ.18వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి శ్రీహరి, ఆశాల యూనియన్ జిల్లా కార్యదర్శి సునీత డిమాండ్ చేశారు. శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లావ వ్యాప్తంగా ఆశా కార్యకర్తలు తహశీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశాలతో వెట్టి చాకిరీ చేయిస్తున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో నాయకులు సత్యమ్మ, నవనీత, ఈశ్వరమ్మ, ఆకాంక్ష, గోపాలమ్మ, సరస్వతి, శ్యామల, రేణుక, పుష్పలత, బాలమ్మ, శోభ, నందిమల్ల రాములు, మదిలేటి, తెలంగాణ ఆశవర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు బుచ్చమ్మ , కార్యదర్శి సునీత , చిట్టెమ్మ, అలివేల, భాగ్య,అనసూయ, చిట్టెమ్మ, పుష్ప, నీలమ్మ, సంద్య, మంజుల, శ్యామల, రాధ, లక్ష్మీదేవి, అరుణ, లావణ్య,సుజాత తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం



అమరచింతలో జ్వరంతో బాధపడుతున్న బాలుడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న డాక్టర్ శరత్



పాన్‌గల్‌లో మాట్లాడుతున్న రామయ్య

అమరచింత: సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, లక్షణాలు ఉంటే వెంటనే ఆస్పత్రికి వెళ్లి వైద్య సేవలు పొందాలని తిప్పుడంపల్లి పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ శరత్ అన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం వల్ల ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. పట్టణంలోని నాలుగు, ఐదు రెండో వార్డుల్లో ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలోని ఆయా వార్డుల్లో శనివారం ఆరోగ్య విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. నిల్వ నీటి తొట్టెల ద్వారా లార్వా పెరిగి దోమలు వ్యాప్తి చెందుతాయని, తద్వారా విష జ్వరాలు, డెంగ్యూ వంటి రోగాలు వేగంగా విస్తరిస్తాయని వివరించారు. పట్టణంలో ఇప్పటికే రెండు డెంగ్యూ కేసులు నమోదయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్, బ్రీడింగ్ చెక్కర్ విజయ్, కృష్ణయ్య పాల్గొన్నారు.

రక్త నమూనాలు సేకరించాలి

పాన్‌గల్: గ్రామాల్లో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్న తరుణంలో వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి జ్వర పీడితుల నుంచి రక్త నమూనాలను సేకరించాలని మండల కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య సూచించారు. శనివారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. రక్త నమూనాలు సేకరించి వాటి ఫలితాల ఆధారంగా వారికి చికిత్స అందించాలని, ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించి పరిసరాల శుభ్రత, దోమల నివారణపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనుమానిత క్షయ లక్షణాలు ఉన్న వారి నుంచి తెమడ సేకరించి పరీక్షలు నిర్వహించి, దాని ఆధారంగా చికిత్స అందించాలన్నారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, విధుల్లో అలసత్వం వహించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాసులు, సూపర్‌వైజర్లు సంతోషమ్మ, సుమనశ్రీ, ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరసన

సాక్షి, నెట్‌వర్క్: అంగన్‌వాడీ టీచర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని 20 రోజులుగా చేస్తున్న సమ్మె శనివారం కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ అంగన్‌వాడీలు నిరసనకు కనీసం స్పందించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో అంగన్‌వాడీల కుటుంబాలన్నీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరించేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీసవేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్‌కింద టీచర్లకు రూ.10లక్షలు, ఆయాలకు రూ.5లక్షలు ఇవ్వాలని సమస్యలన్నింటిని పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శులు గోపాలకృష్ణ, శ్రీహరి, సంధ్యారాణి, శారద, సరళాదేవి, మాదవి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

